RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 289 పేజీలు - 08 ఆదివారం 13 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

● నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం ● గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మిగతా2లో...



## ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

సర్కారుపై విమర్శలు, చురకలు, జోకులు

ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

సీఎం పాత్రలో తలసాని

మంత్రి ఉత్తమ్ పాత్రలో పల్లా

రెవెన్యూ మంత్రి పొంగులేటిని ఇమిటేట్ చేసిన గంగుల

**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** శాసనసభ నుంచి సస్పెండైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు పోటీగా మాక్ అసెంబ్లీని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం లోపాలను, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా మాక్ అసెంబ్లీ ఫోకస్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీనీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా ఇది సాగింది. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మిగతా2లో...

## 'దిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

● బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం ● డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ ● పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన ● ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం ● భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు ● ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

● పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం




**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 12:** భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మం డపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్‌కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. మిగతా2లో...

## సుద్దాల అశోక్ తేజకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం




## అందుబాటులోకి హైడ్రా అధికారిక పోర్టల్

ఒకే వేదికపై పౌర సేవల సమాచారం

వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కమిషనర్ ఏవీ రంగనాథ్



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** హైడ్రా అందిస్తున్న సేవల వివరాలతో పాటు కార్యకలాపాల సమాచారాన్ని ఒకే వేదికపై తెలుసుకునేలా అధికారిక పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం అధికారిక వెబ్‌సైట్ (https://hydraa.telangana.gov.in/) ప్రారంభించారు. హైడ్రాకు సంబంధించిన వివిధ సేవలు, అధికార పరిధి, చెరువుల హద్దులు, కాలువల వివరాలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణ సమాచారం, క్షేత్రస్థాయి కార్యకలాపాలను పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. పోర్టల్‌లో మిగతా2లో...

## రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ మిగతా2లో...

## దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

● తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం ● కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు ● ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు మిగతా2లో...

## సీఎం రేవంత్‌రెడ్డి అవినీతిని బయటపెడతా...

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అవినీతి సామ్రాట్.. బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

మిగతా2లో...

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ



# ‘దిల్లీ డిక్లరేషన్’కు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ‘బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం’ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది. వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# ఉత్సాహంగా బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

మాక్ అసెంబ్లీకి మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహించారు. ఆయా పాత్రలు పోషించిన ఎమ్మెల్యేలు పదునైన విమర్శలు చేస్తూనే జోకులు వేస్తూ నవ్వులు కురిపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలు చేయకపోవడంతో సీఎం, మంత్రులపై చురకలంటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్రలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఒదిగిపోయారు. హైదరాబాద్ యాసలో సీఎంపై విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి సీఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత కీలకమైన విషయాల్లో ఆయన చెప్పిన మాటలను వ్యంగ్యంగా మాట్లాడుతూ నవ్వులు పూయించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాత్రలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి మెరిశారు. ఒక సందర్భంలో ఉత్తమ్ తాను ప్రిపేర్ కాలేదంటూ చెప్పిన విషయాన్ని పల్లా జోకులు జోకులుగా చెప్పి నవ్వించారు. కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలోనూ ఆయన తీవ్రమైన విమర్శలు గుప్పించారు. 22ఏపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రను మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోషించారు. భూములను కొల్లగొట్టేందుకు వేలాది ఎకరాలను 22ఏలో పెట్టారంటూ విమర్శలు గుప్పించారు. మాక్ అసెంబ్లీ లో సీఎం పాత్రధారి తలసాని మాట్లాడుతూ తాము 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నాం.. కానీ 25 ఏండ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, ఈ సమయంలో ఎప్పుడైనా అమలు చేస్తామంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ తో సమస్య, పార్టీలోసమస్య, చివరకు బీఆర్ఎస్‌తోనూ సమస్యే ఉందన్నారు. ఇలా తనకు ఎన్నో సమస్యలు ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంతో సహ ప్రాజెక్టులన్నీ నాటి ప్రధాని ఇందిరాగాంధీ నిర్మించినవేనని ఎద్దేవా చేశారు. అందర్నీ తొక్కుకుంటూ ముఖ్యమంత్రి వరకు ఎలా వచ్చాననే విషయాన్ని అడిగితే చెప్తానని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. వేసవి కాలంలో ఎన్ని టన్నుల ధ్యానం వచ్చిందో తనకు తెలియదన్నారు. పొంగులేటి పాత్రధారి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు తన సొంత డబ్బులు ఖర్చు పెట్టానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బును ఇప్పుడు సంపాధించుకోవాలి కదా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు తానొక్కడినే కమీషన్లు తీసుకుంటున్నట్టు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ భారతీ కాదు...భూ హారతి చేస్తామన్నారు. సమస్య ఏదైనా సెటిల్ మెంట్ లతోనే పరిష్కారమవుతుందని తెలిపారు. మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డితోపాటు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి హైడ్రా అధికారిక పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070 వివరాలను పొందుపరిచారు. చెట్లు కూలిపోవడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు, ఇతర విపత్తు పరిస్థితులపై పౌరులు ఈ నెంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు. **ఫైర్ ఎన్‌వోసీకి ఆన్‌లైన్ దరఖాస్తు** హైడ్రా పోర్టల్ ద్వారానే ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీలకు దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు తమ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు శాఖ డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకునే వీలుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే అవకాశం ఉన్న కీలక ప్రాంతాల వివరాలను అందుబాటులో ఉంచారు. జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఏఎంసీ కమిషనరేట్ల పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను చూడొచ్చు. పోర్టల్ ద్వారా లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం అందుబాటులో ఉంటుంది. **ఎఫ్‌టీఎల్, చెరువులు, బఫర్ జోన్ల వివరాలు** హైడ్రా వెబ్‌సైట్ నుంచి ‘హెచ్‌ఎండీఏ లేక్స్ ప్రొటల్’ను నేరుగా సందర్శించి చెరువులకు సంబంధించిన ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) వివరాలను తెలుసుకోవచ్చు. చెరువులు, ఇతర జలాశయాల చుట్టూ అమల్లో ఉండే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలపై పోర్టల్‌లో సమాచారం అందుబాటులో ఉంటుంది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం, తాజా వివరాలు కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి. హైడ్రా అధికారిక ప్రకటనలు, ప్రెస్ రిలీజ్‌లు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, ముఖ్యమైన ప్రజా సమాచారం కోసం ప్రత్యేకంగా ‘న్యూస్, ఫ్లాస్ న్యూస్’ విభాగాలను ఏర్పాటు చేశారు. దాంతోపాటు భూ భారతి పోర్టల్‌కు హైడ్రా వెబ్‌సైట్‌లో నేరుగా లింక్ అందుబాటులో ఉంది. భూమి కొనుగోలు, ఇతర లావాదేవీలు చేపట్టే ముందు సర్వే నంబర్ లేదా పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక గీత, చేనేత, ఫైలేరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 12:** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.
ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసే ందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూ పకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్య ంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## సిఎం రేవంత్‌రెడ్డి అవినీతిని బయటపెడతా...

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆరోపణలు చేశారు. ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి పాపాల చిట్టాను కొడంగల్ వేదికగా బయటపెడతామని అన్నారు. 20న కొడంగల్‌లో పాం చజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నామని, అదే రోజు కొడంగల్ వేదికగానే ముఖ్యమంత్రి అవినీతిని ప్రజలు ముందు పెడతామని కవిత చెప్పారు. సిఎం కుటుంబ సభ్యులు, మిత్రమండలి, అవినీతి లో రాటుదేలిన మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో తనకు కమీషన్లు ఎందు కంటూ కమల్ హాసన్ లెవల్‌లో ఏకపాత్రాభినయం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆర్‌టిఐ చట్టాన్ని దు ర్వినియోగం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన చరిత్రను ప్రజలు మర్చిపోరని శనివారం ఆమె వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సిఎం రేవం త్‌రెడ్డి, హరీష్‌రావు కుమ్మక్కయారని ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీశ్ రావు తన తండ్రి, కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించారని, దానిపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా..? అని సవాల్ విసిరారు. అటు ప్రజా సమ స్యలను చర్చించాల్సిన అసెంబ్లీని అధికార, ప్రతిపక్షాల గొడవలకు వేదిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. “స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## సుద్దాల అశోక్ తేజకు ‘తెలంగాణ తెలుగు తేజం’ పురస్కారం

**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** రాష్ట్ర స్థాయి బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక ‘తెలంగాణ తెలుగు తేజం’ సాహిత్య పురస్కారం-2026కు ప్రముఖ కవి, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పురస్కార కమిటీ ఛైర్మన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 22న కరీంనగర్‌లో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు..



**తొలి అక్షరం/హైదరాబాద్ :సెప్టెంబర్ 12:** హరీశ్‌రావు తన పరపతిని ఉపయోగించి వేల కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. సిద్ధిపేట జిల్లా వెలికట్టి గ్రామంలో హరీశ్‌రావు తన మామ హనుమంతరావు పేరిట 6 ఎకరాల 18 కుంటల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారని, రూ. 12 నుంచి 18 కోట్ల విలువ చేసే ఈ భూమిని 22-ఏ నుంచి తొలగించి పట్టా భూమిగా మార్చుకున్నారని ఆయన ఆరోపించారు. ఇదే భూమిలోనుంచి వెళ్లిన మిషన్ భగీరథ పైపులైన్‌లకు కూడా డబ్బులు తీసుకున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక మెదక్ జిల్లాలోనూ భారీ భూ కుంభకోణం జరిగిందని మంత్రి ఆరోపించారు. సికింద్రాపూర్ పరిధిలో వక్ఫ్ బోర్డు క్లెయిమ్ చేసిన 569 ఎకరాల్లో, 2023 ఎన్నికల షెడ్యూల్‌కు కేవలం 5 రోజుల ముందు 372 ఎకరాలకు పైగా భూమికి ఆర్డీఓ ద్వారా ఓఆర్సీలు ఇప్పించి ఆ భూములను కాజేశారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ఈ అక్రమ భూముల ద్వారా వచ్చిన సొమ్మును ఎన్నికల్లో ఖర్చు చేశారని మంత్రి ఆరోపించారు. నర్సాపూర్ మండలంలోనూ 22-ఏ నిబంధనల నుంచి 112 ఎకరాల భూములను తొలగించి ఒకే కుటుంబానికి కట్టబెట్టారని, మెదక్ జిల్లాలో కాంగ్రెస్ గెలవకుండా కుట్ర పన్నారని పొంగులేటి తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేస్తాం

### ప్రజా సమస్యలపై పోరాటమే ఆయనకు నిజమైన నివాళి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి




**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 12:** సిపిఎం పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమరజీవి కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో గొప్ప నాయకుడిగా, ప్రజల సమస్యలను లోతుగా అర్థం చేసుకున్న మేధావిగా నిలిచారని కొనియాడారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల హక్కుల కోసం పోరాడిన ఆయన, అత్యవసర పరిస్థితుల సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించి అరెస్టయిన గొప్ప పోరాట యోధుడని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీతారాం ఏచూరి నిరంతరం తన గొంతును వినిపించారని తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలపై తన వాదనను ఎంతో స్పష్టంగా, ఆధారాలతో సహా వినిపించారని చెప్పారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం సీతారాం ఏచూరి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. సీతారాం ఏచూరిని స్మరించుకోవడం అంటే కేవలం చిత్రపటానికి పూలమాల వేయడం కాదని, ఆయన చూపిన మార్గంలో ప్రజా సమస్యలపై పోరాడటమే నిజమైన నివాళి అని బూరుగు కృష్ణారెడ్డి అన్నారు. కార్మిక, కర్షక ఐక్యతను బలోపేతం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉస్కాకుల శ్రీను, ఎండి ఖయ్యూం, కందగట్ల ఆనంద్, పర్ని ధర్మారెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, బావుండ్లపల్లి స్వామి, ఎండి రేష్మ, చికూరు ఈదయ, రాములు, చంద్రయ్య, పల్లె శివ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో గోశిక వినయ్ కుమార్, పిల్లలమర్రి మధుసూదన్

- ప్రజాప్రతినిధుల ఘన సన్మాన కార్యక్రమంలో చౌటుప్పల్ ప్రతినిధుల ప్రత్యేక పాల్గొనడం





**తొలి అక్షరం/చౌటుప్పల్ , సెప్టెంబర్ 12:** హైదరాబాద్ రాజ్ మొహల్లాలో అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ పాల్గొన్నారు. కార్యక్రమానికి పద్మశాలి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి ప్రజాప్రతినిధులను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సమాజ అభ్యున్నతి, ఐక్యత, చేనేత రంగ పరిరక్షణ తదితర అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. చౌటుప్పల్ నుంచి గోశిక వినయ్ కుమార్, పిల్లలమర్రి మధుసూదన్ పాల్గొనడం పట్ల పద్మశాలి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.

# రాజీ మార్గమే రాజ మార్గం..

### రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు

### జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్- 12:** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు యువతకు బొల్లా శివశంకర్ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా

- 50కి పైగా ప్రముఖ సంస్థలు.. 3,000కుపైగా ఉద్యోగ అవకాశాలు.
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- బొల్ల శివశంకర్ ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు.



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 12:** మునుగోడు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివశంకర్ తెలిపారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు 50కి పైగా ప్రముఖ సంస్థలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొననున్నాయని, వివిధ రంగాల్లో 3,000కుపైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయని నిర్వాహకులు తెలిపారు. సంస్థలు, తయారీ రంగం, ఆరోగ్య సేవలు, బ్యాంకింగ్, చిల్లర విక్రయాలుఅమ్మకాలు, మార్కెటింగ్, సమాచార సాంకేతికత, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. **ఉద్యోగ మేళా వివరాలు** తేదీ: సెప్టెంబర్ 27, 2026, ఆదివారంసమయం: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకువేదిక: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తంగడపల్లినిరుద్యోగ యువతకు తమ నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ ఉద్యోగ మేళా మంచి అవకాశమని ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివశంకర్ పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవాలని ఆయన కోరారు. ఆసరా ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లా కవిత తదితరులు ఉద్యోగ మేళా ఏర్పాట్లలో భాగస్వాములవుతున్నారు.

# న్యాయస్థానం ఉత్తర్వులు అమలు చేయాలి

### నేలపట్ల చేనేత సహకార సంఘంలో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అధికారిక కార్యక్రమాలు నిలిపివేయాలి డైరెక్టర్ల విజ్ఞప్తి



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 12:** నేలపట్ల చేనేత సహకార సంఘంలో న్యాయస్థానం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సంఘం డైరెక్టర్లు సంబంధిత అధికారులను కోరారు. గతంలో సుమారు 18 సంవత్సరాల పాటు సంఘ అధ్యక్షుడిగా, వ్యక్తిగత బాధ్యతదారుగా కొనసాగిన పిల్లలమరి శ్రీనివాసులుపై పలు ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని వారు తెలిపారు. సంఘ డైరెక్టర్లు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం.. 201318 పరిపాలనా కాలంలో నల్గొండ కేంద్ర సహకార బ్యాంకు నుంచి రూ. 31,01,852 రుణం మంజూరైందని, చేనేత పారిశ్రామికులకు పని కల్పించేందుకు ఉద్దేశించిన ఈ నిధులను సంఘంలోని సుమారు 40 మంది సభ్యులకు అందించినట్లు దస్తావేజుల్లో చూపించి, నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 8,72,000 పథకం నిధుల్లో రూ. 1,60,000తో పది ఫ్రేమ్ మగ్గాలు ఏర్పాటు చేసి, మిగిలిన రూ. 7,12,000 నిధులను సొంత అవసరాలకు వినియోగించినట్లు ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి వివరణ లేదా అధికారిక విచారణ ఫలితాలు ఈ ప్రకటనలో లేవని డైరెక్టర్లు తెలిపారు. సంఘ కార్యకలాపాలకు సంబంధించిన దస్తావేజులు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంచుకుని, ఇతరుల సహాయంతో జమా ఖర్చులు నిర్వహించేవారని కూడా ఆరోపించారు. **ఎన్నికల అనంతరం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నలుగురు డైరెక్టర్లు** ఇటీవల జరిగిన సంఘ ఎన్నికల్లో పద్మశాలి కుల సంఘం తరఫున ఆరుగురు డైరెక్టర్లు గెలుపొందగా, మరో వర్గం తరఫున ముగ్గురు గెలిచారని డైరెక్టర్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ, చైర్మన్ ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తడక పారిజాత, గంజి శ్రీనివాసులు, తడక కోకేశ్వర్, పిల్లలమరి కిరణ్ తెలంగాణ సహకార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. ముగ్గురు పిల్లలు ఉన్న వ్యక్తులు పోటీకి అనర్హులనే నిబంధన వర్తిస్తుందని పేర్కొంటూ, సంబంధిత ఆధారాలతో 2026 ఆగస్టు 5న ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. అనంతరం పిల్లలమరి శ్రీనివాసుల డైరెక్టర్, చైర్మన్ పదవులకు సంబంధించి న్యాయస్థానం మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసిందని డైరెక్టర్లు పేర్కొన్నారు. **అధికారులకు అందజేసిన న్యాయస్థానం ఉత్తర్వుల ప్రతులు** న్యాయస్థానం ఉత్తర్వుల ప్రతులను ఆగస్టు 6న ఎన్నికల అధికారి, భువనగిరి సహాయ సంచాలకులు, జిల్లా కలెక్టర్‌తో పాటు తెలంగాణ చేనేత, జౌళి శాఖ కమిషనర్‌కు అందజేసినట్లు డైరెక్టర్లు తెలిపారు. అనంతరం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులకు తదుపరి చర్యల కోసం ఆదేశాలు అందినట్లు పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకు జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయానికి చెందిన గోపాల్ సెప్టెంబర్ 8న సంఘ కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, డైరెక్టర్లు గంజి శ్రీనివాసు, తడక కోకేశ్వర్ తదితరుల సమక్షంలో న్యాయస్థానం ఉత్తర్వులను సంఘ భవనానికి అంటించినట్లు తెలిపారు. **ఉత్తర్వులు అమలులో ఉన్నా కార్యక్రమాలు నిర్వహించారని ఆరోపణ** చైర్మన్ పదవిపై మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ఆగస్టు 7న చేనేత సప్తజెండా ఎగురవేయడంతో పాటు, ఆగస్టు 15న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారని డైరెక్టర్లు ఆరోపించారు. న్యాయస్థానం ఉత్తర్వులు అమలులో ఉన్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సంఘ సభ్యులు, చేనేత పారిశ్రామికులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. న్యాయస్థానం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సంఘంలో ఎలాంటి అధికారిక కార్యకలాపాలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానం ఉత్తర్వులు, అధికారుల తదుపరి ఆదేశాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. ప్రస్తుతం పిల్లలమరి శ్రీనివాసుల పదవిపై మధ్యంతర ఉత్తర్వులు ఉన్నందున, ఆయన అనధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల చేనేత పారిశ్రామికులు అయోమయానికి గురికాకుండా సంబంధిత అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్లు కోరారు. ప్రచారంలోకి వచ్చే సమాచారాన్ని నమ్మకుండా న్యాయస్థానం ఉత్తర్వులు, అధికారిక రికార్డులను పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇట్లు నేలపట్ల చేనేత సహకార సంఘం డైరెక్టర్లు 1. తడక పారిజాత 2. గంజి శ్రీనివాసులు 3. తడక కోకేశ్వర్ 4. పిల్లలమరి కిరణ్

# సంజీవ రావును పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో సెప్టెంబర్ 12:** అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు ను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. జిల్లాలోని కురవి మండలంతాళ్ళ సంకీస గ్రామంకి చెందిన అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవ రావు తల్లి చుక్కమ్మ కొద్ది రోజుల క్రితం మృతి చెందగా కాంగ్రెస్ నేతలు...డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్ , జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి, కురవి టౌన్ ప్రెసిడెంట్ ఎన్ రాజేందర్ కుమార్,కురవి మండల మాజీ ప్రధాన కార్యదర్శి ఆవిరె మోహన్ రావు, డాక్టర్ సెల్ జనరల్ సెక్రటరీ ధరావత్ వీరన్న, డా.కరుణాకర్, మోదుగుల గూడెం సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్, నల్లెల్ల గ్రామ అధ్యక్షుడు బండి మల్లయ్య, సీరోలు మండల సీనియర్ నేతలు భిక్షమయ్య ,ప్రతాపని పుల్లయ్య, రుద్రరపు శ్రీనివాస్, వీరిశెట్టి ఉపేందర్, చెబెల్లి కొటెష్, సంగెం నాగరాజు, మీసాల వెంకన్న తదితరులు శనివారం వారి గృహానికి వెళ్లి మృతురాలు చుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, కామ సంజీవరావును పరామర్శించి, వారి కుటుంబానికి సంతాపని తెలియజేశారు.

# ఇక్రాన్ షేక్ చేతుల మీదుగా 'స్నిప్ & స్టైల్' ఘన ప్రారంభం

- మెట్రో సమీపంలో నూతన హెయిర్ స్టూడియో ప్రారంభం
- ఉమేష్‌మాధవి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 12:** హైదర్‌నగర్ డివిజన్‌లో మెట్రో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్నిప్ & స్టైల్' హెయిర్ స్టూడియో సెలూన్ ఘనంగా ప్రారంభమైంది. ఎం సి పి ఐ యు హైదర్‌నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఇక్రాన్ షేక్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీధర్ పంతులు, శ్యామ్‌రావు గౌడ్, ఇజాజ్, ఖలీద్ ముస్తఫా, అసిఫ్ తదితరులు పాల్గొని నిర్వాహకులు ఉమేష్‌మాధవి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిదానపల్లి పాఠశాలకు బెంచీల విరాళం - దాతకు ఘన సన్మానం




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** నిదానపల్లి గ్రామ పాఠశాలకు 10 బెంచీలను విరాళంగా అందించిన మాజీ సర్పంచ్ నారపాక. ధర్మయ్య - గంగమ్మ దంపతులకు గ్రామ ప్రజలు, పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం వారు చేసిన ఈ సహాయం అభినందనీయమని, వారి దాతృత్వం పాఠశాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కొనియాడారు. దాతల సేవా భావం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# ఇంద్రపాలనగరంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాక్ రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, కోరమండల్ మేనేజర్ పి.ప్రసాద్ చేతుల మీదుగా ఈ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వరికుప్పల స్వామి, జూనియర్ ఆగ్రోనమిస్ట్ సాయిప్రసన్న, ఎండీటీ నరేష్, విజయ్, చేనేత సహకార సంఘం చైర్మన్ రవ్వ నర్సింహా, రాజన్నగారి రమేష్, పగుడాల వేణుగోపాల్, బొల్ల నర్సింహా, కాటేపల్లి మహేష్, జిట్టబోయిన వెంకటేష్, మేకల నరేందర్, పగుడాల నరేందర్, బోనగిరి మధు, గర్ధాస్ సాయి, తవుటం శంకరయ్య, రైతులు, చిన్నారులు పాల్గొన్నారు.

# అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ఝాన్సీ రాజేందర్ రెడ్డికి ఘన స్వాగతం



**తొలి అక్షరం/కొడకండ్ల సెప్టెంబర్ 12:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి తన అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లో గల ఆమె నివాసంలో కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో మండల నాయకులు, యువజన నాయకులు మరియు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు ఝాన్సమ్మను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... కొడకండ్ల మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ముందుండాలని నాయకులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్లు బలగాని శివ గౌడ్ శాలువాగప్పి స్వాగతం తెలియజేశారు అలాగే నరేందర్, శివ నాయకులు మస్రూమ్ రవీందర్, బిక్షపతి, నాగరాజు, పాలకుర్తి యువజన అధ్యక్షులు రాజేష్ నాయక్, మధుసూదన్, వెన్నం శ్రీనివాస్, బొమ్మరబోయిన శివకుమార్, పనస శ్రీనివాస్ గౌడ్, జలగం సోమయ్య, శ్రీనివాస్, నరేందర్, శివ మరియు తదితర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఆర్యవైశ్య చలో హైదరాబాద్

- భవన నిర్మాణాల భూమి పూజ
- ముఖ్య అతిథిగా సి ఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర అధ్యక్షులు.అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో
- మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరీ గౌరీ శంకర్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) సెప్టెంబర్ 12:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగాఉప్పల్,బగాయత్లో ,ఆర్యవైశ్య కమ్యూనిటీ , హాస్టల్ భవనాలకు శంకుస్థాపన,భూమిపూజ, జరుగుతున్నందు వలన మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఆర్యవైశ్యులు భూమి పూజలో పాల్గొని మన చిరకాల వాంఛను సాకారం చేస్తున్న రాష్ట్రఅధ్యక్షులు, అమరవాధి. లక్ష్మీనారాయణ జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఆర్యవైశ్యులు హాజరై ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరీ. గౌరీశంకర్ ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని తెలిపారు.

# పేదల సేవలో పువ్వాడ కుటుంబం

**15 ఏళ్లుగా పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**ఉచితంగా అనేక సేవా కార్యక్రమాలు**

**పువ్వాడ జన్మదిన వేడుకకు సేవా కార్యక్రమం..**

**దివ్యాంగులకు కృత్రిమ పాదాల వితరణ**




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్- 12:** మానవతా సేవ, దాతృత్వం, సామాజిక బాధ్యతకు పెద్దపీట వేస్తూ ఖమ్మం జిల్లాలో పువ్వాడ కుటుంబం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ నిరంతరం సేవా స్ఫూర్తిని కొనసాగిస్తోంది. పువ్వాడ ఫౌండేషన్‌ను స్థాపించి, పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, మందుల పంపిణీ, గర్భిణులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడం వంటి అనేక కార్యక్రమాలను చేపడుతూ పేదలకు పువ్వాడ కుటుంబం భరోసాగా నిలుస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు పొందలేని వారికి సైతం అండగా నిలిచి, మానవతా దృక్పథంతో సేవలను అందిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ పువ్వాడ కుటుంబం ప్రజలకు అండగా నిలిచింది. కరోనా బాధితులకు వైద్య సేవలు, మందులు, అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ ఆపద సమయంలో ప్రజలకు తోడుగా నిలిచారు. అదేవిధంగా మమతా ఆసుపత్రి ద్వారా వైద్య సేవలను విస్తృతంగా అందిస్తూ, అనేక మంది పేదలు, నిరుపేదలు మరియు అవసరమైన వారికి వైద్యపరమైన సహాయాన్ని అందిస్తున్నారు. వైద్య రంగంలో సేవలతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ పువ్వాడ కుటుంబం దాతృత్వాన్ని చాటుకుంటోంది. ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వడం, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం, అవసరమైన వారికి ఆపరేషన్లు మరియు మందులు అందించడం, దివ్యాంగులకు అండగా నిలవడం వంటి కార్యక్రమాల ద్వారా “మానవ సేవే మాధవ సేవ” అనే భావనను ఆచరణలో చూపిస్తూ పువ్వాడ కుటుంబం తన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. **జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమం** ఈ నేపథ్యంలో మమతా వైద్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 88 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించి, వారు మరింత స్వావలంబనతో ముందుకు సాగేందుకు తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. “జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమమే అర్థం” అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పువ్వాడ కుటుంబం సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది. ఈ జన్మదిన వేడుక సేవా కార్యక్రమాన్ని గత 15 సంవత్సరాలుగా పువ్వాడ 75వ పుట్టినరోజు నాటి నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తూ సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. ఖమ్మం నగరంలోని రోటరీ క్లబ్ వద్ద సెప్టెంబర్ 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు దివ్యాంగులకు కృత్రిమ పాదాలను పంపిణీ కార్యక్రమాన్ని చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పువ్వాడ కుటుంబ సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

# విద్యే జీవితాన్ని మార్చే శక్తివంతమైన సాధనం

**లక్ష్య సాధన కోసం కష్టపడి..**

**ఇష్టపడి చదవాలి**

**శ్రీ గాయత్రీ కళాశాల చైర్మన్**

**బండారు మయూర్ రెడ్డి**



**చౌటుప్పల్, సెప్టెంబర్ 12:** చౌటుప్పల్‌లోని శ్రీ గాయత్రీ కళాశాలలో నూతన విద్యార్థుల స్వాగత వేడుకను శనివారం వి.వి.ఆర్. గార్డెన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. “శ్రీ గాయత్రీయన్స్ సింఫోనియా ఫ్రెషర్స్ పార్టీ” పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమానికి శ్రీ గాయత్రీ కళాశాల చైర్మన్ బండారు మయూర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం అని అన్నారు. విద్యలో రాణిస్తే గౌరవం, ఆర్థిక స్థిరత్వం, మంచి భవిష్యత్తు సహజంగానే లభిస్తాయని తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం విద్యను ఆయుధంగా చేసుకుని దేశ అత్యున్నత స్థాయికి ఎదిగారని, ఆయన జీవితం విద్య గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. “పేదవారిగా పుట్టడం మన తప్పు కాదు.. కానీ పేదరికాన్ని జయించేందుకు ప్రయత్నించకపోవడం మాత్రం మన తప్పు” అంటూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. జీవితంలో సమయానికి ఎంతో విలువ ఉందని, ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి, ఇష్టపడి చదవాలని సూచించారు. **విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం** కళాశాల కరస్పాండెంట్ భీమిడి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ గాయత్రీ విద్యా సంస్థలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యపై ఉన్న మమకారంతో నిర్వహిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా ధైర్యంగా చదువుకునే వాతావరణాన్ని కళాశాలలో కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వృత్తి మార్గదర్శక తరగతులు, ప్రేరణ తరగతులు, ప్రత్యేక అధ్యయన తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే శ్రీ గాయత్రీ కళాశాల జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలైన ఐఐటీ, నీట్, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లోనూ ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని భీమిడి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. **ఆటపాటలతో విద్యార్థుల సందడి** స్వాగత వేడుకకు విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటపాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుక సందడిగా సాగింది. నూతన విద్యార్థులకు ఉత్సాహాన్ని, ఆనందాన్ని అందించడంతో పాటు తోటి విద్యార్థులతో స్నేహభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ గాయత్రీ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి

**క్రమశిక్షణ, విలువలతో కూడిన**

**జీవితాన్ని అలవర్చుకోవాలి.**

**నలంద డిగ్రీ, అరవిందో జూనియర్**

**కళాశాల చైర్మన్ బత్తుల శంకర్.**








**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 12:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని నలంద డిగ్రీ, అరవిందో జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో నూతన విద్యార్థుల స్వాగత వేడుకలను శనివారం స్థానిక జయశ్రీ వేడుకల మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నలంద డిగ్రీ, అరవిందో జూనియర్ కళాశాలల చైర్మన్ బత్తుల శంకర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకుంటూ విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. **తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి** కళాశాల కరస్పాండెంట్ మీ. రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. విష్ణుకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఇప్పటి నుంచే స్పష్టమైన ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ర్యాంకులు, ఉత్తమ ఫలితాలు సాధించడం సులభమవుతుందని అన్నారు. **నూతన ఆవిష్కరణలతో సమాజానికి సేవ చేయాలి** కళాశాల డైరెక్టర్ సి. హెచ్. దుర్గయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. తమ ప్రతిభను సమాజ అభివృద్ధికి ఉపయోగించే విధంగా విద్యను అభ్యసించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు అందరినీ అలరించాయి. నూతన విద్యార్థులకు ఉత్సాహాన్ని, ఆత్మీయతను కల్పించేలా వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వి. శ్రీనివాసులు, సి. హెచ్. దుర్గయ్య, కె. లింగస్వామి, అధ్యాపక బృందం లింగయ్య, మహేష్, కళ్యాణి, నాగలక్ష్మి, సువర్ణ, పుష్పలత, బాలరాజు, లింగారెడ్డి, మానస, శ్రీదేవి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత అబ్రహం మాతృమూర్తికి నివాళి



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం తల్లి మరణించగా, ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వేముల పుష్ప, కాంగ్రెస్ నాయకులు.

# టీజేడబ్ల్యూఏ జాతీయ సలహాదారుగా డా. కొండ మల్లేశం గౌడ్



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ టీ జె డబ్ల్యూఏ జాతీయ సలహాదారుగా స్థానికం దినపత్రిక సీఈవో డా. కొండ మల్లేశం గౌడ్ నియమితులయ్యారు. నాగోల్ లోని స్థానికం కార్యాలయంలో టీజేడబ్ల్యూఏ జాతీయ జనరల్ సెక్రటరీ షెట్టి వెంకటేష్ గౌడ్ ఆయనకు ఐడీ కార్డు అందజేశారు.

# రామన్నపేట కోర్టుల్లో లోక్ అదాలత్ విజయవంతం



**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 12:** సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత ఆధ్వర్యంలో రామన్నపేట కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ అదాలత్ లో మొత్తం 1,576 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 77 క్రిమినల్ కేసులు, 3 సివిల్ కేసులు, 6 బ్యాంక్ ప్రీ-లిటిగేషన్ కేసులు, 735 ఈ-పెట్టి కేసులు, 755 డీడీ కేసులు ఉన్నాయి.

# భువనగిరిలో శ్రీ చైతన్య ఫ్రెషర్స్ పార్టీ



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** భువనగిరి వైఎస్ఆర్ గార్డెన్ లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, చైర్మన్ గడ్డం శ్రీనివాస్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ అంబోజు మల్లేశ్ పాల్గొని విద్యార్థులకు లక్ష్యసాధనపై దిశానిర్దేశం చేశారు.



# సీనియర్ కాంగ్రెస్ నేత సతీమణి మృతి - నివాళులర్పించిన దైద రవీందర్





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** వెల్లంకి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పున్న. నరసింహ సతీమణి పున్నం జగదాంబ మృతి చెందగా, వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్.కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్య క్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు లింగారెడ్డి, మధు, శశిధర్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా మండల కేంద్రంలో మిషన్ భగీరథ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎన్నిక

**- అధ్యక్షులుగా ఆంగోత్ స్వామి, ఉపాధ్యక్షులుగా లౌడియా మహేందర్**







**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 12:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మిషన్ భగీరథ ఉద్యోగస్తుల సంఘం. నెక్కొండ మండల్ సూపర్వైజర్, అశోక్ ఆధ్వర్యంలో, కొత్త బాడీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులు: అంగోత్ స్వామి, ఉపాధ్యక్షులు: లావుడియ మహేందర్, కోశాధికారి: ముడిదేని శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి: బానోత్ సురేష్, సలహాదారుడు: కందాలపు రాజకుమార్, వీరిని సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.సంఘం సభ్యులు: బానోత్ వెంకటేష్, బోడ సురేష్, మారబోయిన రాజు, బాలకిషన్, రాహుల్, సతీష్, సంతోష్, బాలు, సుభాష్, ప్రకాష్, మధు, మోహన్, శ్రీను, కృష్ణ కాంత్, మల్లయ్య, రాజు తేజావత్, తదితరులు పాల్గొన్నారు.

# లో-వోల్టేజ్ సమస్యలపై రైతుల పక్షాన బిజెపి మహా ధర్నా!!!

**- బిజెపి నాయకులు ఏల చంద్రశేఖర్.**



**తొలి అక్షరం :వలిగొండ, సెప్టెంబర్ 12:** యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుల పిలుపు మేరకు, భూదాన్ పోచంపల్లి మండలంలోని రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన లో-వోల్టేజ్ సమస్య పరిష్కారం కొరకు రూరల్ అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి మరియు టౌన్ అధ్యక్షులు డబ్బుకారు సాహెష్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమంలో జలాల్‌పూర్ సబ్‌స్టేషన్ ఎదుటఈ నిరసన కార్యక్రమానికి చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ ఏలే చంద్రశేఖర్ . కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీ రాజేందర్ రెడ్డి ,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చెరుకు వెంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, చేనేత సెల్ జిల్లా అధ్యక్షులు గంజి బసవలింగం,మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సీత మానస,జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లికాడ బసవయ్య, కౌన్సిలర్ శ్రీరామ్ మంజుల లింగస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బైర్ వెంకటేష్, జిల్లా ఎండోమెంట్ కో కన్వీనర్ కేసారం కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ సత్యనారాయణ. కిసాన్ మోర్చా సుర్కంటి రంగారెడ్డి సీనియర్ నాయకులు తండ రమేష్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు భూపాల్ రెడ్డి రూరల్ టౌన్ ప్రధాన కార్యదర్శులు ముద్దం హరీష్ రామిడి యాదిరెడ్డి, గోలకొండ ప్రభాకర్, ఉప్పునూతుల నరసింహ ,మండల ఉపాధ్యక్షులు సుర్వి శ్రీను, బోదాస్ మల్లేష్ ,బీజేవైఎం మండల అధ్యక్షులు మేకల చంద్రవాస్, బండిరాల సుశీలమ్మ ,మేకల చొక్కా రెడ్డి, చింతల రామకృష్ణ, కొంత శంకర్, పోతుల శ్యామ్, దోస్పాటి అంజయ్య, గంగాపురం కిషన్, చెరుకు రాములు, సీత మణికంఠ, పాలకూరలఎ నవీన్, కేసారం శ్రీకాంత్, బోడ జనార్ధన్, అంబదాస్ మద్ది మధు, బాల నరసింహ, వినయ్ చారి ,గోవర్ధన్, బేతి నిఖిల్, మహేష్ రాకేష్, శ్రీనాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్మత్త భైరవ దేవాలయంలో మహా పాలాభిషేకం





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ పద్మాక్షి రోడ్ మారుతి హిల్స్ లో గల శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయంలో శ్రావణమాసం ముగింపు పొలాల అమావాస్య సందర్భంగా దేవాలయంలో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా మహా పాలాభిషేకం నిర్వహించారు.108 లీటర్ల ఆవుపాలతో పాలాభిషేకం అమ్మవారికి స్వామివారికి భక్తులు సమర్పించారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు వీరభద్రనాథ్ మాట్లాడుతూ ఈ అమావాస్య ఎంతో శక్తివంతమైనదని,వందేళ్లకు ఒకసారి వచ్చే ఈ అమావాస్య రోజుభక్తిశ్రద్ధలతోటి భక్తులు పాల్గొని కూష్మాండ దీపం,మిరియాల దీపం,నారికేల దీపాలు పెట్టి వారి భక్తిని చాటుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మవారికి,స్వామివారికి అంతంత వైభవంగాఅలంకరణ,మహా హారతి,అన్నదాన ప్రసాదందేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# రామన్నపేటలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**• సిబ్బందిని అభినందించిన సిఐ ఎం రవి**







**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని నిత్యం దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను రామన్నపేట పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు.ఎస్ఐ గోపాతి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు,కారును స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠాకు చెందిన నలుగురు చీరాల, బాపట్ల జిల్లాకు చెందిన కావడి అలివేలు(45),కర్రెద్దుల మరియమ్మ(33),చౌట భానుప్రసాద్ (24),హైదరాబాద్, హయత్ నగర్ కు చెందిన కావడి మహంకాళి అలియాస్ లక్ష్మి(39)అనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నిందితుల నుంచి పోలీసులు 32.5 గ్రాముల బంగారు పుస్తెలతాడు,(చౌటుప్పల్ పి.ఎస్ సి ఆర్ నం. 504/2026 కి సంబంధించింది) 40 గ్రాముల బంగారు ఆభరణాలు,నేరానికి ఉపయోగించిన ఏపీ 40 జేఎక్స్ 6438 నంబరు గల స్విఫ్ట్ డిజైర్ కారు,2 సెల్‌ఫోన్లు అదుపులోకి తీసుకున్నారు.ఈ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై గోపాతి సతీష్,ఆయన పోలీసు బృందాన్ని సర్వత్రా అభినందించారు.ఈ సందర్భంగా సీఐ మొగులూరి రవి స్వయంగా ఎస్సై బృందాన్ని అభినందించి,వారికి తగిన రివార్డును అందజేశారు. ప్రయాణికులు రద్దీ సమయాల్లో బస్సులలో తస్కరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.

# డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి పోటీలు




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 12:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు.ముఖ్య అతిథి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. శ్రీనివాసరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖానం అధ్యక్షత వహించారు. కథా రచన, పోస్టర్ మేకింగ్, క్విజ్, డిబేట్ తదితర అంశాల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

# పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలి

**- నాణ్యతతో కూడిన అభివృద్ధే ప్రధాన లక్ష్యం: జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** 21వ డివిజన్ గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.నగరంలోని పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను,బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల నాణ్యత,పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ముందుగా 49వ డివిజన్లోని రెవెన్యూ కాలనీ,ప్రకాశరెడ్డిపేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు,మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్లోని పోచమ్మ మైదాన్,ఎల్బీనగర్,36వ డివిజన్లోని చింతల్,38వ డివిజన్లోని ఖిలా వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సీసీ రోడ్లు,డ్రైనేజీ కాలువలు,మంచినీటి పైప్లాన్ల నిర్మాణ పనుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు.పోచమ్మ మైదాన్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పరిశీలించి,నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని,పనుల పూర్తికి ముందు అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు.ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్,సంతోష్ బాబు,డీఈలు,ఏఈలు,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్ 17 కబడ్డీ పోటీల్లో విజేతలుగా గాయత్రి స్కూల్.....

**• వలిగొండలో మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి.**



**తొలి అక్షరం/వలిగొండ, సెప్టెంబర్ 12:** అండర్ 17 కబడ్డీలో గాయత్రి స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారిని గాయత్రి యజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గారు మాట్లాడుతూ. క్రీడలు విద్యార్థుల్లో శారీరక మానసిక క్రమశిక్షణ నేర్పిస్తుందని అన్నారు. విజేతలను ముక్కామల విగ్నేష్, గూడూరు జస్వంత్ రెడ్డి, గరిసే మణిశంకర్, గర్దాస్ నితీష్, పొన్నాల తరుణ్ రెడ్డి, దోమల శివకుమార్, రాపోలు సాత్విక్, మార్క ప్రేమ్ కుమార్, ఎండి సోహెల్, కంకల అఖిల్ కుమార్ అభినందించారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతము బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేష్, బిమిడి కవిత, జక్క నవీన్ రెడ్డి, పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**రాష్ట్ర అధ్యక్షునిగా నరహరి సుధాకర్ రెడ్డి**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.నారా నాగేశ్వరరావు**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** సామాజిక సేవ రంగాల్లో విశేష కృషి చేసినందుకుగాను ప్రతి ఏటా భారత ప్రభుత్వం జాతీయ యువజన పురస్కారాలను అందజేస్తుంది. 1985 నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రం నుండి 34 మంది యువత ఈ పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతల అసోసియేషన్ కు ప్రతి ఏటా సీనియార్టీ ప్రకారంగా అధ్యక్ష కార్యదర్శుల తో పాటు నూతన కమిటీ ఎంపిక జరుగుతుంది. ఈ దఫా ఈ ఎంపిక హనుమకొండ జిల్లాలోని బిర్లా ఓపెన్ మైండ్స్ సమావేశపు హాల్ లో జరిగింది. ఈ ఎంపిక కార్యక్రమానికి ప్రిసైడింగ్ ఆఫీసర్ గా జాతీయ యువజన అవార్డు గ్రహీతల సీనియర్ సభ్యులు మండల పరశురాములు వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు అందరు కలిసి ఏకగ్రీవంగా వరంగల్ జిల్లాకు చెందిన నరహరి సుధాకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఈయన ఒక సంవత్సరం పాటు కొనసాగనున్నారు. గతంలో నెహ్రూ యువ కేంద్రం మరియు యువజన సర్వీసుల శాఖ ద్వారా యువత సంక్షేమం కోసం కృషి చేశారు. శాంతి సర్వీస్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి నాబార్డ్ ద్వారా రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం లయన్స్ క్లబ్ 320ఖీ డిస్టిక్ గవర్నర్ గా సేవలందిస్తున్నారు. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ కు చెందిన డాక్టర్ నారా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కరీంనగర్ జిల్లాకు చెందిన రెండ్ల కలింగ శేఖర్, డా. కందేరావు సుధారాణి, ఖమ్మం జిల్లాకు చెందిన బండారు లక్ష్మణ్ లు, సహాయ కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన ఏ కిరణ్ కుమార్, కోశాధికారిగా వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ ఆకులపల్లి మధు, మీడియా ఇన్చార్జిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అల్వాల విష్ణు లు ఎంపికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ గా






సిద్దిపేట జిల్లాకు చెందిన డాక్టర్ దేశ బోయిన నరసింహులు, మంచిర్యాల జిల్లాకు చెందిన తగరపు సత్యం, నల్గొండ జిల్లాకు చెందిన గంజి రాజేందర్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర యువజన విధానాన్ని ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల యువతను అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసే విధంగా యువజన విధానాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి, స్వయం ఉపాధి, విద్య, క్రీడలు, సామాజిక సేవ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతల అసోసియేషన్ యువత సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా నరహరి సుధాకర్ రెడ్డి జాతీయ యువజన అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో మేరా యువ భారత్ డిపార్ట్మెంట్ జిల్లా సమన్వయ కర్త భూక్య సంజీవ్ నాయక్ మరియు తెలంగాణ రాష్ట్రంలోని పలువురు జాతీయ యువజన అవార్డు గ్రహీతలు పాల్గొని యువత అభివృద్ధి, ప్రభుత్వ పథకాలలో వారి భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు.

# 'ఇండియాస్పార్క్ ఫేస్ ఆఫ్ ఇండియా 2026' సుబుధికి గుర్తింపు

**● ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి 'ఫేస్ ఆఫ్ ఇండియా 2026'**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి ప్రతిష్ఠాత్మక 'ఇండియాస్పార్క్ ఫేస్ ఆఫ్ ఇండియా 2026' గుర్తింపు లభించింది. ఇండియాస్పార్క్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో భాగంగా ఆయనను ఈ గౌరవానికి ఎంపిక చేశారు. ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థాగత నాయకత్వ రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. మూడు దశాబ్దాలకు పైగా విద్యా, పరిశోధనా రంగాల్లో అనుభవం ఉన్న ప్రొఫెసర్ సుబుధి, స్మార్ట్ గ్రిడ్లు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన సాంకేతికత వంటి ఆధునిక రంగాల్లో విశేష పరిశోధనలు చేస్తున్నారు. ఆయన 300కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు ఆరు పుస్తకాలను రచించారు. ఐదు పేటెంట్లు ఆయన పేరిట ఉన్నాయి. 46 మందికి పైగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ప్రతిష్ఠాత్మక జె.సి. బోస్ ఫెలోషిప్పు అందుకున్న ప్రొఫెసర్ సుబుధి, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, యూకే సంస్థల Fellowగా ఉన్నారు. 2023 నుంచి ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ సుబుధి, సంస్థలో పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ గవర్నెన్స్‌ను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. విద్యా, పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు పలు చర్యలు చేపట్టారు. యువ పరిశోధకులకు మార్గదర్శకత్వం అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ ఆయన విస్తృతమైన విద్యా, పరిశోధనా సహకారాలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఇండియాస్పార్క్ వ్యవస్థాపకురాలు, సీఈఓ రూపా తంతి మాట్లాడుతూ, "ప్రొఫెసర్ సుబుధిని సత్కరించడం మాకు గర్వకారణం. ఎన్ఐటీ వరంగల్‌లో ఆయన అందిస్తున్న పరివర్తనాత్మక నాయకత్వం, సుస్థిర ఇంధన రంగంలో చేస్తున్న మార్గదర్శక పరిశోధనలు భారత ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి" అని అన్నారు.

# పోలీసు పిల్లల చదువుకే తొలి ప్రాధాన్యం

**● అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ● తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ● మాదకద్రవ్యాలకు దూరం..సాహస క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ● యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకాడమిక్ బ్లాక్‌కు డీజీపీ సీవీ ఆనంద్ భూమిపూజ ● ఆర్మీ స్కూల్ తరహా శిక్షణ..రాబోయే రోజుల్లో 720 మందికి అవకాశం ● 50శాతం సాధారణ విద్యార్థులకూ చోటు**









**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), సెప్టెంబర్ 12:** పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడమే వారి సంక్షేమానికి అసలైన పునాది అని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఉద్ఘాటించారు. తమ పిల్లల భవిష్యత్తు గురించి పోలీసులకు ఎలాంటి ఆందోళన లేనప్పుడే, వారు తమ విధులపై మరింత ఏకాగ్రతతో దృష్టి సారించగలరని చెప్పారు. మంచిరేవులలోని ఆక్టోపస్-(గ్రేహౌండ్స్) ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకాడమిక్ బ్లాక్-1 నిర్మాణానికి ఆయన ఘనంగా భూమిపూజ చేశారు. **అంతర్జాతీయ ప్రమాణాలు.. ఆర్మీ స్కూల్ తరహా శిక్షణ:** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్మీ, సైనిక్ స్కూళ్ల తరహాలోనే జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో వైఐపీఎస్ ను అభివృద్ధి చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. గతేడాది 120 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 360కి చేరిందన్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే వచ్చే విద్యాసంవత్సరానికి ఈ సంఖ్య 720 వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. **పాఠ్యాంశాలతో పాటు సాహస క్రీడలు:** కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులను భావి బాధ్యతాయుత పౌరులుగా మార్చడమే తమ లక్ష్యమని డీజీపీ స్పష్టం చేశారు. విద్యార్థులను మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. చదువుతో పాటు క్రికెట్, రాక్ క్లైంబింగ్, గుర్రపు స్వారీ వంటి సాహస క్రీడల్లోనూ శిక్షణ ఇస్తామని తెలిపారు. **సాధారణ విద్యార్థులకూ తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య:** ఈ పాఠశాల సేవలను హోంగార్డుల పిల్లలకూ అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలోని మొత్తం సీట్లలో 50 శాతం సాధారణ విద్యార్థులకు కూడా కేటాయిస్తున్నామని, అత్యంత తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారంతో ఒకే ప్రాంగణంలో ప్లస్-2 (ఇంటర్మీడియట్) వరకు తీర్చిదిద్ది వచ్చే రెండేళ్లలో రాష్ట్రాలోనే అత్యున్నత విద్యాసంస్థగా మార్చడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, డీజీ (ఆక్టోపస్) అనిల్‌కుమార్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ (పి,ఎల్) గజరావు భూపాల్, ఏఐజీ రమణకుమార్, లీగల్ అండ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్‌కుమార్, డీసీపీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఏసీపీలు, వివిధ సంస్థల ప్రతినిధులు, వైఐపీఎస్ ప్రిన్సిపాల్ డా. అనితా రెడ్డి, జీఎం రాజేష్, పోలీసు అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బోనమెత్తితే అమ్మవారే కనిపించాలి.. జోగిని మనీషా భక్తిరూపం!

**● అమ్మవారి స్వరూపాన్ని తలపించేలా జోగిని మనీషా అలంకరణ**

**● బోనం ఎత్తిన వేళ.. సాక్షాత్తు అమ్మవారే దర్శనమిచ్చిన అనుభూతి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 12:** హైదరాబాద్ చుట్టుపక్కల పండుగల వేళ బోనమెత్తే భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. అయితే జోగిని మనీషా అమ్మవారి స్వరూపాన్ని తలపించేలా సంప్రదాయ వస్త్రధారణ, ఆభరణాలు, ప్రత్యేక అలంకరణతో బోనం ఎత్తిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తలపై బోనం.. ముఖంలో దైవత్వం.. సంప్రదాయ అలంకరణలో అమ్మవారి రూపాన్ని ప్రతిబింబించేలా జోగిని మనీషా కనిపించడంతో చూసిన ప్రతి ఒక్కరికీ సాక్షాత్తు అమ్మవారే దర్శనమిచ్చిన అనుభూతి కలుగుతోందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేడుకలకు మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చిన జోగిని మనీషా భక్తిరూపం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

# 1980ల నాటి ఫోటోల ట్రెండ్ వెనుక సైబర్ సైలెంట్ ఉచ్చు

**- ఫోన్‌లలోకి హానికర ఎపికే ఫైళ్లు.. బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేసే ప్రమాదం**

**- టిజీసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్**

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తీవ్ర హెచ్చరిక**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), సెప్టెంబర్ 12:** సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న 1980ల రెట్రో ఫోటో ఎడిటింగ్ ట్రెండ్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు విరుచుకుపడుతున్నారు. సాధారణ ఫోటోలను 1980ల నాటి క్లాసిక్ లుక్‌లోకి మారుస్తామంటూ ఉచిత ఆఫర్లతో వల వేస్తూ ప్రజల వ్యక్తిగత, ఆర్థిక డేటాను కొల్లగొడుతున్నారు. ఈ రకమైన మోసాల పట్ల తీవ్ర అప్రమత్తత అవసరమని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్బి) శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సైబర్ కేటుగాళ్లు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా ఉచితంగా అపరిమితంగా రెట్రో ఫోటో ఎడిటింగ్ చేసుకోండంటూ ఆకర్షణీయమైన లింకులను ప్రచారం చేస్తున్నారు. ఆ లింకులపై క్లిక్ చేయగానే వినియోగదారులను అధికారిక ప్లేస్టోర్ లేదా యాప్ స్టోర్‌లకు కాకుండా థర్డ్ పార్టీ వెబ్‌సైట్లకు తీసుకెళ్తున్నారు. అక్కడ నుంచి అనుమానాస్పద ఎపికే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయించి ఫోన్‌లలో ఇన్స్టాల్ చేయిస్తున్నారు. ఇలాంటి హానికరమైన యాప్‌లు ఫోన్‌లోకి ప్రవేశించగానే అవసరానికి మించి సిస్టమ్ అనుమతులు కోరుతాయి. ఒకసారి పర్మిషన్లు ఇవ్వగానే ఫోన్‌లోని ఎస్ఎంఎస్‌లు, బ్యాంకింగ్ ఆథెంటికేషన్ కోసం వచ్చే ఓటీపీ లు, కాంటాక్ట్ లిస్ట్, నోటిఫికేషన్లు సహా సున్నితమైన బ్యాంకింగ్ వివరాలన్నింటినీ దొంగిలిస్తాయి. ఈ డేటాను ఉపయోగించి ఖాతాల నుంచి డబ్బులు ఖాళీ చేయడం, గుర్తింపు దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడుతున్నారని అధికారులు వెల్లడించారు. (టిజిసిఎస్బి) డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ..ఆకర్షణీయంగా కనిపించే ఫోటో ఎడిటింగ్ ఆఫర్ కూడా సైబర్ మోసానికి వేసిన ఉచ్చు కావచ్చు అని ఆమె తెలిపారు. లింక్‌పై క్లిక్ చేసే ముందు ఆలోచించండి, ఇన్స్టాల్ చేసే ముందు పర్మిషన్లను నిర్ధారించుకోండి అని సూచించారు. తెలియని ఎపికె ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు అని విజ్ఞప్తి చేశారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని, యాప్‌లను కేవలం అధికారిక యాప్ స్టోర్ల నుంచే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద యాప్‌లు ఉంటే వెంటనే అన్‌ఇన్స్టాల్ చేసి పర్మిషన్లను రద్దు చేయాలని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌కు, వాట్సాప్ నంబర్ 8712672222 కు లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని అధికారు తెలిపారు.



# ప్రజా పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వమే నిదర్శనం!

- బీసీల సమస్యలపై పీసీసీ చీఫ్‌కు వర్ధన్నపేట నేతల వినతి
- బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన బొక్కల ప్రమోద్,కుల్ల యాకాంతం



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబరు12:** తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను వర్ధన్నపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, వర్ధన్నపేట మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం శనివారం కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వెంకట్రావుపల్లి గ్రామ సమస్యలతో పాటు బీసీ వర్గాలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుల్ల యాకాంతం మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని విమర్శించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నుంచి వార్డు స్థాయి ప్రజాప్రతినిధి వరకు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను గడప వద్దకే తీసుకువస్తున్నారని పేర్కొన్నారు.గతంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులకే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి ఉండేది.కానీ నేడు సీఎం రేవంత్‌రెడ్డి,టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ సామాన్య కార్యకర్తలకు, ప్రజలకు సైతం అందుబాటులో ఉంటున్నారు.ఇదే అసలైన ప్రజా పాలనకు నిదర్శనం అని యాకాంతం అన్నారు. ప్రజా సమస్యలను నేరుగా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ సమస్యల పరిష్కారంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ ఫోన్‌లో టిండర్ ఉందా?

- టిండర్ చాటింగ్..ఖాతా క్లీనింగ్
- రూ.3.35 కోట్లు స్వాహా చేసిన వర్చువల్ మోహిని
- డేటింగ్ యాప్ ఉచ్చు లో పడి నగర వ్యాపారవేత్త విలవిల
- సోషల్ మీడియా మోసాలపై (టిజీసిఎస్బి) తీవ్ర హెచ్చరిక
- టిజీసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్12:** డేటింగ్ యాప్‌లో అందమైన అమ్మాయి బొమ్మ కనిపించింది.. కబుర్లతో కరిగించింది..కమ్మటి మాటలతో నమ్మకం కుదిర్చింది..తీరా ఆ లేడీ మాటలు నమ్మి పెట్టుబడులు పెడితే ఏకంగా రూ.3.35 కోట్లు ఆవిరైపోయాయి.ఆన్‌లైన్ డేటింగ్, సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న మరో భారీ అంతర్జాతీయ పెట్టుబడి మోసాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజీసిఎస్బి) శనివారం వెలుగులోకి తెచ్చింది. నగరానికి చెందిన ఒక బాధితుడికి ప్రముఖ డేటింగ్ యాప్ టిండర్ ద్వారా ఒక విదేశీ యువతి పరిచయమైంది.ఆ తర్వాత వాట్సాప్ ద్వారా నిత్యం వ్యక్తిగత, కుటుంబ విషయాలు పంచుకుంటూ అతడితో సన్నిహిత సంబంధం ఏర్పరచుకుంది. బాధితుడి నమ్మకాన్ని పూర్తిగా సంపాదించిన తర్వాత, ఫేస్‌బుక్/మెటా ప్రకటనల ద్వారా తాను రోజూ కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నట్లు బురిడీ కొట్టించింది. ఆమె పంపిన లింక్ ద్వారా బాధితుడు ఒక నకిలీ అప్లికేషన్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదట్లో చిన్న మొత్తంలో పెట్టిన పెట్టుబడులకు భారీగా లాభాలు వచ్చినట్లు ఆ యాప్‌లో చూపించడంతో అది నిజమైన ప్లాట్‌ఫారమ్ అని నమ్మాడు.దీంతో ఆశపడ్డ బాధితుడు 55 రోజుల వ్యవధిలో విడతలవారీగా ఏకంగా రూ. 3.35 కోట్లను ఆ కేటుగాళ్ల ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం పెట్టిన డబ్బుతో పాటు లాభాలను వెనక్కి తీసుకునేందుకు బాధితుడు ప్రయత్నించగా అసలు మోసం బయటపడింది.మీ క్రెడిట్ స్కోర్ తగ్గింది, డబ్బులు డ్రా చేసుకోవాలంటే మరికొంత మొత్తం కట్టాల్సిందే అని నిందితులు మెలిక పెట్టారు. అనుమానం వచ్చి తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే టిజీసిఎస్బి అధికారులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసిన పోలీసులు లావాదేవీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా టిజీసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో ఏర్పడిన పరిచయం మీ ఆర్థిక భద్రతకు ముప్పు కాకూడదు అని హెచ్చరించారు.తెలియని వ్యక్తులు చూపే పెట్టుబడి ఆశలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు అని విజ్ఞప్తి చేశారు.టిండర్,మేట్రిమోనీ, సోషల్ మీడియా వేదికల్లో పరిచయమైన వ్యక్తులు త్వరగా భావోద్వేగ సంబంధాలు పెంచుకుని పెట్టుబడుల ప్రస్తావన తెస్తే తీవ్ర అప్రమత్తత అవసరమని స్పష్టం చేశారు. తెలియని వ్యక్తులు పంపే నకిలీ ట్రేడింగ్ యాప్‌లను, లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయకూడదని హెచ్చరించారు.ఒకవేళ మోసపోయినట్లు తెలిస్తే మొదటి గంట వ్యవధిలో (గోల్డెన్ హౌవర్) 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు గానీ, www.cybercrime.gov.in పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును హోల్డ్‌లో పెట్టి తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని (టిజీసిఎస్బి వెల్లడించింది.

# అప్పులు, వడ్డీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**జగన్, చంద్రబాబు ప్రభుత్వాల హయాంలో చేసిన అప్పులపై ప్రజలకు లెక్కలు చెప్పాలి**

**కరువు పరిస్థితులపై కేంద్రం ప్రత్యేక నిధులు విడుదల చేయాలి**




**తొలి అక్షరం/కడప సెప్టెంబర్ 12:-** ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాల హయాంలో చేసిన అప్పులు, వాటిపై చెల్లించిన వడ్డీకి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కేంద్ర మాజీ మంత్రి చింత మోహన్ డిమాండ్ చేశారు. శనివారం కడప వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్, చంద్రబాబు ప్రభుత్వాల హయాంలో ఎన్ని వేల కోట్ల రూపాయలు అప్పులు చేశారో, ఎంత వడ్డీ చెల్లించారో వెల్లడిస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. అప్పుగా తీసుకున్న నిధులను ఏ జిల్లాలో ఎంత మేరకు ఖర్చు చేశారో కూడా ప్రజలకు తెలియజేయాలని అన్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, కరువు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని చింత మోహన్ పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి అండగా నిలవాలని కోరారు. ఏపీలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం నుంచి రాత్రి వరకు ఉక్కపోతతో అల్లాడుతున్నారని అన్నారు.

**పెరిగిన ధరలతో సామాన్యులపై భారం** బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని చింత మోహన్ విమర్శించారు. బియ్యం, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, ఎరువులతో పాటు ఉప్పు, పప్పు, నూనె, గుడ్లు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

**డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం** దేశంలో జరగనున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ కారణంగా దక్షిణ భారతదేశానికి తీరని నష్టం జరిగే అవకాశం ఉందని, ఇది దేశ రాజకీయ సమతుల్యతపై ప్రభావం చూపుతుందని అన్నారు. భారత రాజ్యాంగానికి ఎలాంటి నష్టం కలిగించే చర్యలు చేపట్టినా దేశం ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా మాటలు, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని చింత మోహన్ పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వ కుతంత్రాలను తిప్పి కొట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం చూపించాలి

**పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**



**తొలి అక్షరం/కర్నూలు సెప్టెంబర్ 12:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి వైసిపి కార్యకర్తలను అణిచివేసేందుకు ఇలాంటి కుతంత్రాలు చేస్తున్నారో తెలుసుకుని వాటిని ఎలా ఎదుర్కోవాలో బాగా ఆలోచించి పని చేయాలని సూచించారు. పత్తికొండలో జరిగిన వైసిపి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలలో చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం తెలిసినంతగా మరి ఎవరికి తెలియదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడవడం కాకుండా, పింఛన్లు ఇస్తామని మరోసారి స్థానిక సంస్థలలో మోసం చేసి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తారని ఆరోపించారు. చంద్రబాబు కుతంత్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి గ్రామస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేసి స్థానిక సంస్థల్లో ఘనవిజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీలో ఒకరికొకరు నష్టపరచుకోకుండా అధిష్టానం చెప్పిన వారికి సంపూర్ణ సహకారం అందించాలని దిశ నిర్దేశం చేశారు.అనంతరం అనుబంధ సంఘాల పార్టీ నాయకులకు, రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులకు వైఎస్ఆర్సిపి ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ ఐడి కార్డులు పార్టీ నేతలు, కార్యకర్తలు చేసిన సేవలకు గుర్తింపులుగా నిలుస్తాయని కంగాటి శ్రీదేవమ్మ గారు చెప్పారు.ఈ పత్తికొండ నియోజకవర్గం స్థాయి సమావేశంలో మండల కన్వీనర్లు,రాష్ట్ర కమిటీ నాయకులు, ఎంపీఎ లు, జడ్పిటిసిలు, ఎస్సీ ,ఎస్టీ వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులు, ఎస్టీ సెల్ జోనల్ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా కమిటీ సభ్యులు,పత్తికొండ తాలూకా అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఐదు మండలాల ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు సభ్యులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# జాతీయలోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం




**తొలి అక్షరం/కర్నూలు సెప్టెంబర్ 12:** రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు ఆరవ అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పి. వాసు, ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలలో 61,000 పైగా కేసులు పరిష్కారం అయ్యాయి. 153 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో 10,25,27,963/- బాధితులకు నష్టపరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఇప్పించడం జరిగినది. శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 6 మంది రైతుల వారసులకు రూ. 98,000/- రూపాయలు నష్టపరిహారంగా ఇప్పించడం జరిగింది. జిల్లా జడ్జి మాట్లడుతూ లోక్ అదాలత్ లో తమ కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 31 బెంచీలను ఏర్పాటు చేసి 300 పైగా సివిల్ కేసులు, 60 వేలు పైగా క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులు 131 పరిష్కరించామని తెలిపారు. ఏసీబీ కోర్ట్ అదనపు జిల్లా జడ్జి శ్రీ విద్య , ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, శాశ్వత లోకాదల చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ ప్రసిడెంట్ చంద్రుడు , రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మినరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యా రాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ సరోజనమ్మ, మొబైల్ కోర్టు జడ్జి అనూష, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ, ఐదవ అదనపు మెజిస్ట్రేట్ ప్రవంతి,కోర్టు మానిటరింగ్ సి. ఐ. రామా నాయుడు, న్యాయ వాదులు, బ్యాంక్ అధికారులు, బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా న్యాయ సేవా సదన్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ




**తొలి అక్షరం/కర్నూలు సెప్టెంబర్ 12:** ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ ఆఫీస్ కర్నూల్,జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ మరియు సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా న్యాయ సేవా సదన్ లో జరిగిన వినాయక మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు చైర్మన్ పి. వాసు, మాట్లడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందని, కానీ మట్టి వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు, సహజసిద్ధమైన మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి పూజించే సంస్కృతిని విద్యార్థుల్లో, ప్రజల్లో ప్రోత్సహించడమే ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లడుతూ జిల్లా జడ్జి చొరవతో కోర్ట్ సిబ్బంది కి, న్యాయ వాదులకు మట్టి తో చేసిన వినాయక పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసా మన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులానే పూజించాలని దీని వలన పర్యావరణ దెబ్బ తినకుండా ఉంటున్నదని తెలిపారు.అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుతూ భక్తిని కొనసాగించేలా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు.అసోసియేషన్ ఆఫ్ అలియాన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.అనంతరం జిల్లా జడ్జి చేతుల మీదుగా న్యాయ వాదులకు, కోర్ట్ సిబ్బంది కి మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.




# నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.
తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

# రచ్చ లేపడానికి రెడీ..

## ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్




యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ""స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు.ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు.
కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు
. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు.

# విడుదలకు ముందే 'స్పిరిట్' పై రగడ..

## రివ్యూవర్స్‌కు సందీప్ వంగా సోదరుడి సవాల్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న 'స్పిరిట్' చిత్రంపై అప్పుడే ఓ కొత్త వివాదం రాజుకుంది. సినిమా విడుదల కాకముందే, సినీ విమర్శకులను ఉద్దేశించి సందీప్ సోదరుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. 'స్పిరిట్' సినిమాను తమ రివ్యూలతో 'చంపేయండి' చూద్దాం అంటూ ఆయన బహిరంగంగా సవాల్ విసిరారు.
ఇటీవల ఆయన నిర్మాణంలో వచ్చిన 'రోమాంచకం' చిత్రానికి మిశ్రమ స్పందన లభించిన నేపథ్యంలో ప్రణయ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమాను తెరకెక్కించడానికి పడే కష్టం తెలియకుండా విమర్శకులు సులభంగా రివ్యూలు రాస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.
"మీరు నిర్మాణ రంగంలోకి వస్తేనే ఒక దర్శకుడు కథను తెరపైకి తీసుకురావడానికి ఎంత కష్టపడతాడో, ఎన్ని సమస్యలు ఎదురవుతాయో తెలుస్తుంది" అని ఆయన అన్నారు.ఈ క్రమంలోనే తమ తదుపరి భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' గురించి ప్రస్తావిస్తూ.. "వారికి నిజంగా సత్తా ఉంటే, 'స్పిరిట్' విడుదలైనప్పుడు చూద్దాం. ఆ సినిమా రిలీజ్ అయ్యాక దాని స్పిరిట్‌ను 'కిల్' చేయడానికి ప్రయత్నించండి, అప్పుడు చూసుకుందాం" అని ప్రణయ్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.
'స్పిరిట్' సినిమా విషయానికొస్తే.. ప్రభాస్-సందీప్ వంగా కలయికలో వస్తున్న తొలి చిత్రమిది. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ తృప్తి డిమ్రీని ఖరారు చేశారు. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.ఇదిలా ఉంటే.. సల్మాన్ ఖాన్ సినిమాతో పోటీని తప్పించుకోవడానికి 'స్పిరిట్' విడుదల 2027 ఈద్ నుంచి వాయిదా పడుతుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని చిత్ర నిర్మాణ సంస్థ టీ-సిరీస్ కొట్టిపారేసింది. "సినిమా విడుదల తేదీలో ఎటువంటి మార్పు లేదు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే షూటింగ్ జరుగుతోంది. 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా 'స్పిరిట్' ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని టీ-సిరీస్ ప్రతినిధి స్పష్టం చేశారు.




# రామ్ పోతినేని సినిమాలో హీరోయిన్‌గా సంయుక్త

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ=ఆరాూ23'. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు చిత్రబృందం తెరదించింది. ప్రముఖ నటి సంయుక్తను కథానాయికగా ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడటం విశేషం.సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రాజెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు.
నియో-నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో రామ్ ఈ సినిమాలో అలరించనున్నారని, నటుడిగానే కాకుండా దర్శకుడిగా కూడా ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.

# పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు.నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.